స్వచ్ఛమైన నీటినే సరఫరా చేస్తాం

జలమండలి మేనేజర్ రామకృష్ణారెడ్డి

మణికొండ: శుద్ధి చేసిన అనంతరం స్వచ్ఛమైన తాగు నీటినే ప్రజలకు సరఫా చేస్తామని జల మండలి మణికొండ డివిజన్ మేనేజర్ రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మణికొండ సెక్రటేయట్ కాలనీలోని సంప్‌ను శుద్ధి చేసే పనులను చేపట్టామన్నారు. గండిపేట నీటిని అక్కడే ఉన్న ఫిల్టర్ బెడ్‌తో శుద్ధి చేసి అదే నీటిని ట్యాంకర్ల ద్వారా ప్రజలకు అందిస్తున్నామన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒక సారి సంప్‌లు, రిజర్వాయర్‌లను శుభ్రం చేయిస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా గండిపేట నీటిని శుభ్రం చేస్తున్న ఫిల్టర్ బెడ్ పనితీరును అధికారులు సమీక్షించాలని, గండిపేట నీటిని ట్యాంకర్ల ద్వారా తీసుకుంటే అందులో మురుగు వాసన వస్తుందని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు ఫిల్టర్ బెడ్ పనితీరును సమీక్షించాలని వారు కోరుతున్నారు.

నీటి పొదుపుపై అవగాహన

మణికొండ: నీరు జీవనాదారం దాన్ని పొదుపుగా వాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పీడ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు నందీశ్వర్‌గౌడ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ ప్రభుత్వ పాఠశాల, అలకాపూర్ టౌన్‌షిప్‌లోని స్కాలర్స్ అకాడమీ, శివాజీనగర్ పొదుపు మహిళా సంఘాల మహిళలకు సోమవారం నీటి పొదుపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకోవటంతో పాటు భూమి నుంచి మనం తీసుకుంటున్న నీటిని తిరిగి భూమిలోకి వర్షం నీటిని ఇంకించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. అందుకు ప్రతి ఇంటికి సంప్ మాదిరిగానే ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నీటిని పొదుపుగా వాడతామని విద్యార్థులు, మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పొదుపు సంఘాల ఆర్‌పీలు లావణ్య, రాజేశ్వరి, అధ్యక్షురాలు సావిత్రి, టీఎంసీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


పీపీఈ కిట్స్‌పై పారిశుద్ధ్య సిబ్బందికి అవగాహన



మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లోని కార్యాలయంలో సోమవారం పారిశుద్ధ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర హాజయ్యారు. నేషనల్ సఫ్‌లై కర్మచారీస్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారు నిర్వహిస్తున్న నషనర్ యాక్షన్ ఫర్ మేకనైస్డ్ శానిటేషన్ ఎకో–సిస్టం కార్యక్రమంలో భాగంగా జన్ రోబోటిక్స్ వారితో కలిసి పీపీఈ కిట్స్ ఉపయోగం, ఆయుష్మాన్ భారత్ కార్డ్, ఈ–కేవైసీ గురించి పారిశుద్ధ్య సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకట్‌రెడ్డి, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ డీఎంగా వేణుగోపాల్



రాజేంద్రనగర్: టీజీఎస్ ఆర్టీసీ రాజేంద్రనగర్ డిపో మేనేజర్‌గా పని చేసి బదిలీపై ఎంజీబీఎస్ కార్గోకు వెళ్లిన బద్రీనారాయణకు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. అలాగే హెడ్ ఆఫీస్‌లో పనిచేసే ఎం.వేణుగోపాల్‌ను రాజేంద్రనగర్ డిపో మేనేజర్‌గా బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో వేణుగోపాల్ ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఎస్‌టీఐ సుశీల, మెకానికల్ ఇంజినీర్ నీలిమ, స్వరూప, డిప్యూటీ సూపరింటెండెంట్ శేఖర్‌రెడ్డి, రాజేంద్రనగర్ డిపో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చెక్కును అందజేస్తున్న మార్కెట్ కమిటీల చైర్మన్‌లు

మణికొండ: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించే నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) ఎంతగానో ఉపకరిస్తుందని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని శివాజీనగర్‌కు చెందిన గోవర్ధన్‌కు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 32 వేలకు సంబంధించిన చెక్కును అందజేశారు. మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ యాలాల నరేష్, నాయకులు బి.శ్రీరాములు, డి.కిరణ్, శ్రావణ్‌కుమార్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియలో కదలిక

- మార్చి 31లోగా చేసుకుంటే ఫీజులో 25 శాతం రాయితీ
- కార్పొరేషన్ పరిధిలో 7,964 దరఖాస్తులు
- ఆమోదించినవి 4,554
- తిరస్కరణలో ఉన్నవి 3410
- ప్రస్తుతం రూ. 4.43 కోట్ల వసూలు

అక్రమ ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు స్పందన




దరఖాస్తుదారులతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అక్రమ ప్లాట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) ప్రక్రియలో మళ్లీ కదలిక మొదలైంది. భూముల రెగ్యులరైజేషన్‌కు ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. అందులో భాగంగా నిర్దేశించిన గడువులోగా అక్రమ ప్లాట్ల క్రమబద్ధీకరించుకున్న వారికి ప్రభుత్వం రాయితీ ప్రకటించడంతో దరఖాస్తుదారులు టౌన్ ప్లానింగ్ విభాగాలకు పరుగులు తీస్తున్నారు.

- కార్పొరేషన్ పరిధిలో మొత్తం 7,964 దరఖాస్తులు వచ్చాయి. ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీంపై ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించగా వాటిలో ప్రభుత్వ స్థలాలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూములు, కోర్టు వివాదాలు, నాలాలు, సరస్సులు, రక్షణ భూములు వంటి అభ్యంతరకరమైనవి 3410 దరఖాస్తులు తిరస్కరణకు గురికావడంతో ఆమోదించినవి 4,554 ఉన్నాయి.
- కార్పొరేషన్ పరిధిలో ఇప్పటి వరకు క్లియరెన్స్ చేసిన దరఖాస్తుల సంఖ్య కేవలం 439 మాత్రమే. అందులో ప్రొసీడింగ్స్ అందజేసినవి 273 మిగతా వాటికి త్వరలోనే ఇస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. వీటిద్వారా వచ్చిన ఆదాయం రూ. 4.43 కోట్లు మాత్రమే.
- 2020 అక్టోబర్‌లో స్థలాల రెగ్యులరైజేషన్ కోసం అప్పటి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ముందు రూ. 1000 కట్టి మీ సేవా కేంద్రాల్లో ప్లాట్ల నెంబర్లపై ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించినా పెద్దగా పురోగతి కనిపించలేదు.
- ఈ నేపథ్యంలో గతంలో ఇచ్చిన ఉత్తర్వుల్లో కొన్ని సవరణలు చేసి దరఖాస్తు దారులకు మార్చి 31 వరకు 25 శాతం రాయితీ ఇవ్వడంతో ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.
- ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టి అక్రమ ప్లాట్ల క్రమబద్ధీకరణ వల్ల కలిగే ప్రయోజనాల గురించి దరఖాస్తుదారులకు వివరించి, ఈ నెల 31వ తేదీలోగా వంద శాతం పురోగతి సాధించాలని రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ అధికారుల ప్రత్యేక సమావేశంలో వెల్లడించిన విషయం తెలిసిందే.

సద్వినియోగం చేసుకోవాలి



కార్పొరేషన్‌లోని ప్రజలు నిర్దేశించిన గడువు మార్చి 31లోగా 25 శాతం రాయితీ పొంది అనుమతులు లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు ఎల్‌ఆర్‌ఎస్ సద్వినియోగం చేసుకోవాలి. అక్రమ ప్లాట్ల క్రమబద్ధీకరించుకుంటేనే ఇంటి నిర్మాణానికి పర్మిషన్ ఇస్తారు. లేకుంటే ఇంటి నిర్మాణానికి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి అనుమతులు పొందలేరు.

– బి.శరత్‌చంద్ర, కమిషనర్, బండ్లగూడ జాగీర్

రాయితీ పొందండి



కార్పొరేషన్ పరిధి దరఖాస్తుల సంఖ్య మొత్తం 7,964. నిషేధిత జాబితా భూములలో ఉన్నందున తిరస్కరణకు గురైనవి 3410 దరఖాస్తులు ఉన్నాయి. ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా తక్కువ మొత్తంలో ప్లాట్ల క్రమబద్ధీకరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి సమాచారం ఇస్తున్నాం. క్లియరెన్స్ చేసిన కొందరు దరఖాస్తుదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్నాం.

– వాణి, టీపీఓ

మధుబన్‌కాలనీలో సమస్యలు పరిష్కరించండి



డీసీకి వినతిపత్రం ఇస్తున్న కాలనీ అధ్యక్షుడు కుమార్

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మధుబన్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వి.కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం సర్కిల్ కార్యాలయంలో ఉప కమిషనర్ రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కాలనీలో ప్రధాన రహదారి పూర్తిగా గుంతల మయం కావడంతో బస్సులు సరిగా తిరగలేకపోతున్నాయన్నారు. గతంలో రెండు ప్రధాన రహదారులపై తిరిగే బస్సులు ఇప్పుడు ఒకే రోడ్డుపై తిరుగుతున్నాయన్నారు. కాలనీకి వచ్చే మరో రోడ్డు కూడా మరమ్మతులు చేసి రెండు వైపుల నుంచి బస్సు తిరిగేలా చూడాలన్నారు. కాలనీలో పర్యటించి సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని డీసీని కోరారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, కావటి వెంకటేష్, ఉదయ్‌కుమార్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి కష్టాలు లేకుండా చూడాలి

బండ్లగూడ: వేసవి దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత జలమండలి అధికారులపై ఉందని మాజీ కార్పొరేటర్ సంతోషి రాజిరెడ్డి అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్‌లో నీటి సమస్యలను తీర్చేందుకు కొత్త మోటర్, జంక్షన్ ఏర్పాటు చేసినందుకు ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జలమండలి జీఎం, మేనేజర్, సూపర్‌వైజర్ యాదగిరి, మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గుంతలమయంగా అంజలిగార్డన్ రోడ్డు

మణికొండ: నిర్మాణం పూర్తి కాని ఓ గేటెడ్ కమ్యూనిటీకి డ్రైనేజీ కనెక్షన్ ఇచ్చే క్రమంలో రోడ్డును తవ్వారు. నామమాత్రపు మరమ్మతులతో అంజలి గార్డన్ కాలనీ రోడ్డంతా గుంతల మయంగా మారిందని నివాసితులు వాపోయారు. బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం ఆధ్వర్యంలో సోమవారం గుడ్‌మార్నింగ్ మణికొండ పేరుతో కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు పుప్పాలగూడ, అలకాపూర్ ప్రజలు తమ కాలనీ మీదుగా ఐటీ జోన్, నానక్‌రాం గూడకు రాకపోకలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా ఉందన్నారు. తాగు నీరు నిర్ణీత సమయం లేకుండా 45 నిమిషాలు మాత్రమే ఇవ్వటంతో నీరు ఏమాత్రం సరిపోవటం లేదన్నారు. ఓ నిర్మాణ సంస్థ రెడీమిక్స్ ప్లాంట్‌తో వాయు కాలుష్యం ఏర్పడుతుందని, దాన్ని తొలగించాలని వారు కోరారు. వీధి కుక్కలను మరో చోటకు తరలించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.ధన్‌రాజ్, జి.నరేందర్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, కిరణ్, సుమనళిని, బి. శ్రీధర్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల జీతాలు పెంచాలని ఆందోళన



మహాధర్నాలో పాల్గొన్న కార్మికులు, నాయకులు

రాజేంద్రనగర్: పురపాలక సంస్థల్లోని అన్ని విభాగాల్లో పనిచేసే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం ఎదుట సోమవారం మున్సిపల్ సంఘం మండల కార్యదర్శి టి.ఆనంద్ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జైపాల్ రెడ్డి మాట్లాడుతూ... కార్మికులను పర్మనెంట్ చేసేంతవరకు కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేల ప్రకారం అమలు చేయాలన్నారు. కార్మికులు విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదం జరిగి మరణించిన కార్మికుల కుటుంబానికి రూ. 25 లక్షల ప్రకారం ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. కార్మికుడు మరణిస్తే రూ. 30 వేల దహన సంస్కారాల ఖర్చుగా ఇవ్వాలని... పండగ, జాతీయ, సీఎల్, సెలవులు అమలు చేయాలన్నారు. అనంతరం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సంఘం నాయకులు ఎ.రాజు, ఎ.సాయిలు, నరసింహా, శ్రీకాంత్, నరేశ్, పెంటయ్య, అండాలు, కలమ్మ, శాంతమ్మ, మంగమ్మ, శివరాణి, లక్ష్మమ్మ, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నకిలీ లీజు పత్రంతో ఆస్పత్రి రెన్యువల్

- అరోణా ఆస్పత్రి డైరెక్టర్ అరెస్టు
- భవన యజమాని ఫిర్యాదుతో వెలుగులోకి

మణికొండ: అద్దె భవనంలో కొనసాగుతున్న ఆస్పత్రి లీజు పత్రాలను ఫోర్జరీ చేసి వైద్య శాఖ అధికారులకు ఇచ్చి లైసెన్స్ రెన్యువల్ చేయించిన డైరెక్టర్‌ను నార్సింగి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రధాన రోడ్డులో రెండు దశాబ్దాలుగా అరోణా ఆస్పత్రిని డాక్టర్ అలియమ్మ సెబాస్టియన్ కొనసాగిస్తుంది. భవన యజమానితో 2021వ సంవత్సరంలో అద్దె ఒప్పందం ముగిసింది. అయినా ఆస్పత్రిని ఖాళీ చేయకపోవటం, అద్దె ఒప్పందం తిరిగి చేసుకున్నట్టు నకిలీ పత్రాలను సృష్టించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు అందజేశారు. దాంతో వారు ఆస్పత్రి నిర్వహణకు అనుమతులను జారీ చేశారు. భవన యజమాని మరణించటంతో అతని కూతురు సనా ఫాతిమా నార్సింగి పోలీసులకు రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేసింది. దాంతో విచారణ చేపట్టిన పోలీసులు ఆస్పత్రి డైరెక్టర్, డాక్టర్ అలియమ్మ సెబాస్టియన్ నకిలీ పత్రాలను సృష్టించి వైద్య శాఖ అధికారులను బురిడీ కొట్టించిన విషయం తెలుసుకుని కేసు నమోదు చేశారు. సోమవారం ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు నార్సింగి పోలీసులు తెలిపారు.

చెత్తను తడి, పొడిగా వేరుచేసి ఇవ్వాలి



కంపోస్టు తయారీ ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు తమ ఇళ్లల్లోని చెత్తను తడి.. పొడిగా వేరు చేసి రోజూ ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందజేయాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ తెలంగాణ ఆదేశాల మేరకు వన్ డే వన్ థీమ్ కార్యక్రమంలో భాగంగా కొత్వాల్‌గూడలోని బండ్లగూడ జాగీర్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రిసోర్స్ పార్క్‌లో డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్(డీఆర్‌సీసీ), కంపోస్టు తయారీ ప్రక్రియను పరిశీలించారు. ప్రతి ఇంట్లో నుంచి సేకరించిన రోజు వారి చెత్తలో వచ్చిన పొడి చెత్తను రీసైక్లింగ్ చేసి రీయూస్ చేయాలన్నారు. తడి చెత్తతో కంపోస్టు తయారు చేసి మొక్కలకు సేంద్రియ ఎరువుగా ఉపయోగించాలని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్లు నరేందర్, రాము, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ ఐదుగురికి జైలు

చార్మినార్: తాగి వాహనాన్ని నడుపుతూ పట్టుబడితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా తప్పదని చార్మినార్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుంకరి వీరశేఖర్ అన్నారు. సిటీ కాలేజ్ చౌరస్తా వద్ద నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో ఐదు మంది వాహనదారులు మద్యం సేవించి పట్టుబడ్డారన్నారు. వీరిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా జరిమానాతో పాటు జైలు శిక్ష విధించారన్నారు. కేసులో 5 మందిని జైలుకు పంపారు. సైదాబాద్‌కు చెందిన వెంకటేష్, గచ్చిబౌలికి చెందిన సుభాష్, చెలాపురా ప్రాంతానికి చెందిన మాలిక్, లాల్ శర్మ, ఇసామియా బజార్‌కు చెందిన గౌస్ తదితరులను 5వ జేఎంఎఫ్సీ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారమన్నారు. ఇందులో వెంకటేష్‌కు ఒకరోజు, సుభాష్‌కు 3 రోజులు, గౌస్, లాల్ శర్మ, మాలిక్‌కు 2 రోజుల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి వరుసగా రూ. 3300 జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

రాయదుర్గం: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల గృహ సముదాయం గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, సామూహిక పారాయణంకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముగింపు రోజు 27వ తేదీ ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉగాదిని పురస్కరించుకుని 30వ తేదీ రాత్రి 7 గంటలకు పంచాంగ పఠనం ఉంటుందని వివరించారు. ఇక ఏప్రిల్ 6వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు సీతారాముల కల్యాణం ఉంటుందని తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

రోడ్డుపై మొరాయించిన ఆర్టీసీ బస్సు



దుర్గానగర్ చౌరస్తాలో నిలిచిపోయిన బస్సును పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ దుర్గానగర్ చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్సు నడిరోడ్డుపై బ్రేక్‌డౌన్ అయింది. దీంతో స్థానికంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. విషయం తెలుసుకొని అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణంకు సమాచారం అందించారు. వారు దుర్గానగర్ చౌరస్తాకు చేరుకోని రోడ్డు మధ్యలో ఉన్న ఆర్టీసీ బస్సును తొలగించేందుకు ప్రయత్నించారు. బస్సు కదలక పోవడంతో ఏసీపీ మరమ్మతులు చేసేందుకు సైతం ప్రయత్నించారు. ఎంతకీ కాకపోవడంతో క్రేన్‌ను రప్పించి రోడ్డుపై ఉన్న బస్సును పక్కకు తొలగించారు. బస్సు రోడ్డుపై నిలిచిపోవడంతో ఏర్పడిన ట్రాఫిక్‌ను పోలీసులు క్లియర్ చేయించారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై పెయింటింగ్ పోటీలు

ఎంజీఐటీ ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో ఎంజీఐటీ ప్రిన్సిపాల్

మణికొండ: రహదారులపై పరిమితికి మించిన వేగంతో ప్రయాణించి యువత ప్రమాదాల బారిన పడి నిండు ప్రాణాలను పణంగా పెడుతున్నారని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం గండిపేటలోని కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, ఆర్ట్ క్లబ్ సభ్యులు కలిసి ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాదాలు, నివారణపై పెయింటింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తల్లితండ్రులు తమ పిల్లలకు అడిగింది ఇప్పించినా వాటి వినియోగానికి పరిమితులు పెట్టాలన్నారు. ఉత్తమ పెయింటింగ్‌లు వేసిన విద్యార్థులకు ఆయన బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.బాల్‌రెడ్డి, ఆర్ట్స్ క్లబ్ ఇంచార్జి ఎ.వీరభద్రరావు, ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రవిచందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శారద విద్యామందిర్ స్నాతకోత్సవం



పట్టాలు అందుకున్న విద్యార్థులు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని శారద విద్యామందిర్ స్నాతకోత్సవం సందడిగా సాగింది. ఎంఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించిన స్నాతకోత్సవ సంబరాల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బోనాల జాతర, నృత్యాలు, నాటికలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నర్సరీ విద్యార్థులు, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ప్రణాళికాబద్ధంగా చదివితే విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని కరస్పాండెంట్ దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. పాఠశాల డైరెక్టర్లు ప్రణవ్‌తేజ్‌రెడ్డి, జనార్దన్, మమత, ఉపాధ్యాయులు మస్రత్‌ఫాతిమా, మనీషా, సంధ్య, శ్రీనివాస్‌రెడ్డి, అఫ్సర్, దౌలత్, అపర్ణ, ఆసియా, సోని, అఖిల, సువర్ణ, రాణి, మూర్తి, హారిక, సుస్మిత, మనోజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో స్వచ్ఛ భారత్



గోల్కొండ: కేంద్ర ప్రభుత్వ పథకం కాయా కల్ప్‌లో భాగంగా సోమవారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు తోటి వైద్యులు, నర్సింగ్ సిబ్బందితో కలిసి ఆసుపత్రిలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..తమ ఆసుపత్రి గత సంవత్సరం ప్రతిష్టాత్మకమైన కాయా కల్ప్ అవార్డుకు ఎంపికయ్యిందన్నారు. ఆసుపత్రి ఔట్ పేషంట్, ఇన్ పేషంట్ విభాగాలు, ఆపరేషన్ థియేటర్, లేబర్ రూమ్ తదితర విభాగాలను పలుమార్లు పరిశీలించి అధికారులు కాయా కల్ప్ అవార్డు ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్‌ఎంవో డాక్టర్ రాకేష్, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల అందజేత

గోల్కొండ: ఉజ్వల భవిష్యత్తుకు కఠోర శ్రమ ఎంతో అవసరమని ప్రముఖ సంఘ సేవకుడు సయ్యద్ హామేద్ అలీ ఖురేషి అన్నారు. తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్‌లో సోమవారం గోల్కొండ ఇస్లామిక్ స్కూల్‌లో విద్యార్థులకు దుస్తులు, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఏకాగ్రతతో చదివితే అద్భుత ఫలితాలు సాధించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్‌నజీబ్, కార్యాలయ ఇన్‌చార్జి మహ్మద్ ఫహాద్ తదితరులున్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

గోల్కొండ: నానల్‌నగర్ పద్మనాభనగర్‌లోని శ్రీగణపతి సేవా సమితి దేవాలయంలో సోమవారం 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉదయం చండీహోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అదే విధంగా సాయంత్రం శివపార్వతుల కల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు వీఎస్ నాయుడు మాట్లాడుతూ.. ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలను అందరి సహకారంతో కనులపండుగగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ పూజల్లో సెక్రటరీ ధర్మారావు, కోశాధికారి సత్యనారాయణమూర్తి, కమిటీ సభ్యులు నిక్కు జనార్దనారావు, రామకృష్ణా, నర్సింహరావు, శివశంకర్, మురళీధర్‌రావు, మహేష్, భరత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.